క్లుప్తంగా

త్యాగానికి ప్రతీక రంజాన్


వెంకటేశ్వర్, కలెక్టర్


హర్షవర్ధన్‌రాజు, జిల్లా ఎస్పీ


శుభం బన్సల్, జాయింట్ కలెక్టర్

తిరుపతి అర్బన్: ముస్లింలకు పవిత్ర రంజాన్ పండుగ (ఈద్- ఉల్-ఫితర్) శుభాకాంక్షలు తెలుపుతూ భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రంజాన్ పండుగ ఈద్-ఉల్-ఫితర్ అనేది ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగ అన్నారు. ముస్లింలు పవిత్ర ఉపవాసాలతో గడిపే రంజాన్ నెలకు ముగింపు రోజు అని వెల్లడించారు. సఖ్యతకు, త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు. ముస్లింలు సుఖ సంతోషాలతో సహృద్భావ వాతావరణంలో పండుగను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా ఇఫ్తార్


దళిత ఇఫ్తార్ విందులో ముస్లింలు, అతిథులు

తిరుపతి కల్చరల్: సర్వమత సమానత్వంతో జనావళి మెలుగుతూ సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన జీవకోనలోని మజీద్ ఏ మహ్మదీయలో ఆదివారం సాయంత్రం దళితులు, ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తారు విందుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ అంబేడ్కర్ హజ్రత్ మొహమ్మద్ మొహాని 1949లో తొలి దళిత ముస్లిం ఇఫ్తార్ విందు ప్రారంభించారన్నారు. వారిని అనుసరిస్తూ జీవకోనలోని మజీద్ ఏ మహమ్మదీయలో ఏటా రంజాన్ చివరి వారంలో దళిత ముస్లిం ఇఫ్తార్ విందు కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. అనంతరం ముస్లిం ఈద్గా వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మహ్మద్ అలీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దళిత సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ధనశేఖర్, ఏఎం జేపీసీ జాతీయ అధ్యక్షుడు రఫీ హిందూస్తానీ, ముస్లింలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి

తిరుపతి కల్చరల్: పోలీసుల సహకారంతో శ్రీవేంకటేశ్వర సుమో అండ్ క్వాలీస్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాత్రికుల సౌకర్యార్థం రైల్వేస్టేషన్‌లోని వీఐపీ ఎంట్రన్స్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

తిరుపతి రూరల్ : తిరుచానూరులోని పడమర కోనేటి వీధి వద్ద ఉన్న శ్రీపద్మావతీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సేవా సమాజం భవనంలో సోమవారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు అన్నదాన సేవాసమాజం అధ్యక్షుడు ఎన్.పి.కల్యాణ్, కార్యదర్శి సాయిరామ్, కోశాధికారి టి.అనుదీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపద్మావతీ ఆర్యవైశ్య యువకిరణాలు సంఘం స్థాపించిన సదర్భంగా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సన్మానం


విద్యాస్వరూపానందగిరిస్వామిని సన్మానిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆశ్రమంలో ఘనంగా సన్మానించారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న జగదీష్ శిష్య బృందం , పద్య, గద్య శ్లోకాల పోటీలలో పాల్గొన్న విద్యార్థులు, ప్రణవాలయ పాహి పాటకు నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు








భరతనాట్యం చేస్తున్న విద్యార్థిని


నృత్య కారుడిని సత్కరిస్తున్న ఏబీ ఎలక్ట్రానిక్స్ అధినేతలు మహేష్, మహేంద్ర, అన్నమాచార్య కాలేజ అధినేత గంగిరెడ్డి, కెనరా బ్యాంక్ జీఎం పాండురంగ మితంతాయ


అమిగోస్ అధినేత అనిత్‌కుమార్‌రెడ్డికి సత్కారం



సకల శుభాల విశ్వావసు..

తెలుగు నూతన సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో తెలుగుదనం ఉట్టిపడేలా.. ఏబీ ఎలక్ట్రానిక్స్, అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, అన్నమాచార్య వర్సిటీ, శుభమస్తు షాపింగ్‌మాల్, కెనరా బ్యాంక్ సంయుక్త సహకారంతో సాక్షి ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అతిథులు పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆడిటోరియాన్ని పూలతో విశేషంగా అలంకరించారు. - తిరుపతి తుడా, తిరుపతి సిటీ


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి


సాక్షి ఉగాది వేడుకలకు హాజరైన విద్యార్థులు, నగర ప్రజలు, మేధావులు


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


చిన్నారులచే పదవతరగతి పాఠ్యపుస్తకాలను చదివిస్తున్న దృశ్యం


సాక్షి ఉగాది ఉత్సవాల వెల్‌కమ్ వేదిక వద్ద సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

వేడుకగా ఉగాది ఉత్సవం

- పంచాంగ శ్రవణం చేసిన పండితులు
- ఈసారి అన్ని శుభాలే..
- పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ఆదివారం ఉగాది ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఫణికుమార్ శర్మ పంచాంగ శ్రవణం చేస్తూ తిథి, వార, నక్షత్ర, యోగం వంటి వాటి గురించి తెలుకోవడమే పంగాంగమని తెలిపారు. పూర్వ రాజులు ప్రతి రోజు పంచాంగ శ్రవణం చేసేవారని, ఇది ఎంతో పుణ్యఫలమన్నారు. శ్రీవేంకటేశ్వరున్ని భక్తితో సేవిస్తే అన్నీ శుభాలే కలుగుతాయన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. అనంతరం ఆయా రాశుల వారికి ఈ ఏడాది కలిగే ఫలాలను తెలియజేశారు. అనంతరం పంచాంగ కర్తను శ్రీవారి ప్రసాదం, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. తర్వాత హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మేడసాని మోహన్ ప్రదర్శించిన అష్టావధానం ఆకట్టుకుంది. దీనికి ముందు ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు చక్కని మంగళధ్వని, ప్రార్థన వినిపించారు. తర్వాత ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో వేద పండితులు వేద స్వస్తి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీపీపీ కార్యదర్శి రఘునాథ్, ప్రోగ్రాం అధికారి రాజగోపాలరావు, సంక్షేమ విభాగం డెప్యూటీ ఈఓ ఆనందరాజు, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌యూలో ..


మహతిలో అష్టావధానం చేపడుతున్న మేడసాని మోహన్, పృచ్ఛకులు


పంచాంగశ్రవణం చేస్తున్న ఫణికుమార్ శర్మ

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ విశ్వాస నామ ఉగాది సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణకర్తగా విశ్వవిద్యాలయం పరీక్షా విభాగ నియంత్రణాధికారి డాక్టర్ కంభంపాటి సాంబశివమూర్తి పంచాంగం పరమార్థాన్ని వివరించారు. అనంతరం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి, విద్యార్థులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ వీసీని అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, డీన్లు దక్షిణమూర్తి శర్మ, ప్రొఫెసర్ రజనీకాంత్, సత్యనారాయణాచార్య, ప్రొఫెసర్ వెంకట్రావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు

శిల్పారామంలో ఉగాది సంబరాలు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా జరిగిన సంబరాలు ప్రేక్షకులు అందరినీ ఆకట్టుకున్నాయి. సెలవు దినం కావడంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శిల్పారామం సందర్శకుల తాకిడితో నిండుకుంది. ఉగాది సంప్రదాయాలకు అనుగుణంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులకు ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు శ్రీ రాఘవ స్వామి పంచాంగ పఠనం చేయగా ఆ తరువాత ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాయంత్రం 5.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు శ్రీ శంకర నాట్య విద్యాలయం నుంచి సంగీత శివ కుమార్ వారి బృందంచే ప్రదర్శించిన భరత నాట్యం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కోటి డ్యాన్స్ అకాడమీ బృందం జానపద, శాస్త్రీయ, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఈ ఏర్పాట్లను శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ పర్యవేక్షించారు.

స్థానిక ఆలయాల్లో ఉగాది వేడుకలు

తిరుపతి కల్చరల్: నగరంలోని టీటీడీ స్థానికాలయాల్లో ఆదివారం శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, కొలువు నిర్వహించారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు పంచాగ శ్రవణం, ఉగాది ఆస్థానం చేపట్టారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి పాల్గొన్నారు. అలాగే శ్రీకోదండరామాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి వారు మూలవర్లకు, ఉత్సవర్లకు వస్త్రసమర్పణ చేశారు. కార్యక్రమలో ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


శ్రీకోదండరామస్వామి వారికి వస్త్రాలను తీసుకొస్తున్న పెద్దజీయర్ స్వామి, అర్చకులు

అమ్మవారి ఆలయంలో ...


ఆస్థానం నిర్వహించేందుకు వెళ్తున్న అర్చకులు, అధికారులు

తిరుచానూరు(చంద్రగిరి): శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఉగాది ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి వైఖానస ఆగమోక్తంగా అభిషేక సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి అధికారులు, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ ఇతర ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో ఉగాది వేడుకలు

తిరుపతి తుడా: తిరుపతి ప్రెస్‌క్లబ్లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం నిర్వహించారు. వెంకట గాయత్రి సేవా ట్రస్ట్ అధ్యక్షులు శేషగిరిరావు సహకారంతో జ్యోతిష్య పండితులు మువ్వా జగన్మోహన్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అలాగే శతావధాని భరత్ శర్మ ఉగాది విశిష్టత, తెలుగు ప్రాముఖ్యతను వివరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, బాలచంద్ర, ఉపాధ్యక్షులు లావణ్య కుమార్, జాయింట్ సెక్రటరీ విజయ యాదవ్, ఈసీ మెంబర్ నాగార్జున ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఉగాది విశిష్టతను వివరిస్తున్న భరత్‌శర్మ


వీసీని సన్మానిస్తున్న అధ్యాపకులు



నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు


కళాకారులకు జ్ఞాపికలను అందిస్తున్న శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్


పుష్పాలంకరణలో శ్రీవారి ఆలయం

ఉగాది ఆస్థానంలో పాల్గొన్న జీయర్ స్వాములు , టీటీడీ అధికారులు



పుష్పవర్ణ శోభితం

తిరుమల శ్రీవారి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ ఉద్యానవన విభాగం ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫల, పుష్పాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందుకోసం 8 టన్నుల సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్ ఉపయోగించారు. విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో శ్రీవారి ఆలయాన్ని అలంకరించారు. ఈ పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. - తిరుమల

ఆకట్టుకుంటున్న వివిధ రూపాల ఆకృతులు







